

జైబోలో.. మట్టి గణపతికి..

పర్యావరణహిత ప్రతిమలకు ఆదరణ



మెదక్‌లో మట్టి ప్రతిమలకు మెరుగులుదిద్దుతున్న కళాకారుడు

మెదక్, ఆగస్టు 31: వినాయక చవితి వచ్చిందటే ఊరూవాడా మండపాలు వెలుస్తాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా పోటాపోటీగా గణేషుడి విగ్రహాలు ఏర్పాటుచేసి భక్తిశ్రద్ధలతో నవరాత్రి పూజలు చేస్తారు. ఆకర్షణీయమైన రంగులు, తీరొక్క రూపాల్లో గణేషుడి తయారుచేసిన ప్రతిమలను ఎక్కడెక్కడి నుంచో కొనుగోలుచేసి తీసుకువస్తారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు పర్యావరణానికి హాని చేస్తాయని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తుండడంతో మండపాల నిర్వాహకుల్లో మార్పు మొదలైంది. ప్రకృతికి హాని చేయని మట్టి ప్రతిమల ఏర్పాటుపై ఆసక్తి చూపుతున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు సైతం మట్టి వినాయకుడి ప్రతిమలను పంపిణీ చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌లో విషపూరిత రసాయనాలైన సల్ఫర్, మెగ్నీషియం, భాస్వరం, లెడ్ కార్బన్, మెర్క్యూరీ, జిప్సం ఉంటాయి. ప్రతిమలను నిమజ్జనం చేసినప్పుడు అవి నీటిలో చేరి జలచరాలకు నష్టం చేస్తాయి. పీవోపీతో నీటి ఊటలు తగ్గిపోయే అవకాశముందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మట్టి వినాయక ప్రతిమలను జలాశయాల్లో నిమజ్జనం చేసినా ఏలాంటి ఇబ్బంది లేకుండా కరిగిపోతాయి. మెదక్ పట్టణంలో మట్టి వినాయకుల అమ్మకాలకు ప్రత్యేకంగా దుకాణాలు వెలిశాయి. ధర ఎక్కువైనా మృత్తికా గణపతులనే పూజించాలని ప్రజలు కొనుగోలు చేస్తున్నారు.



మెదక్‌లో అమ్మకానికి ఉంచిన మట్టి గణేష్ ప్రతిమలు

చెక్కుల పంపిణీలో మరోసారి రసాభాస

నర్సాపూర్ నియోజకవర్గం కౌడిపల్లి మండలంలో రచ్చ

బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం

7

హడలెత్తిస్తున్న హైడ్రా

పటాన్‌చెరు, అమీన్‌పూర్‌లో కమిషనర్ పర్యటన



బీరంగూడ శంభునికుంటను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

నగర శివారు సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్ పరిధిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం పర్యటించారు. ఇప్పటికే పలుమార్లు ఆయన పటాన్‌చెరు ప్రాంతాలపై ఫోకస్ పెట్టగా.. అక్రమార్కులు హడలెత్తిపోతున్నారు. శనివారం ఆయన పటాన్‌చెరులోని సాకి చెరువు, శాంతినగర్ కాలనీలో అక్రమ నిర్మాణాలను, చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో జీహెచ్ఎంసీ నిర్మించిన రోడ్డును పరిశీలించారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ బీరంగూడలోని శంభునికుంటను, అమీన్‌పూర్ గ్రామ శివారులోని సంభిచెరువును పరిశీలించారు. చెరువులు, కుంటల పరిధిలో జరిగిన ఆక్రమణలు, గొలుసుకట్టు కాల్వలను పూడ్చి నిర్మించిన ఇళ్ల వివరాలతో కూడిన నివేదిక సిద్ధం చేసి నోటీసులు జారీ చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు.

- పటాన్‌చెరు, ఆగస్టు 31

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



కంది పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

కంది, ఆగస్టు 31 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. కంది మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. మరో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని నిర్దేశించారు. అనంతరం ఆమె తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. 'ధరణి' ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. చెరువులు ఆక్రమణకు గురవకుండా నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీవో మహేందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్య, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మందులు అందుబాటులో ఉంచాలి : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కొల్చారం, ఆగస్టు 31: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొల్చారంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యకేంద్రంలో అన్ని మందులు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు.

రెడ్ అలర్ట్..

వాతావరణశాఖ హెచ్చరిక



ఉమ్మడి మెదక్ జిల్లాలో మరో మూడు రోజులు వర్షాలు

మెదక్ అర్బన్, ఆగస్టు 31: తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి మెదక్ జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి వరకు అన్ని మండలాల్లోనూ చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షం పడుతోంది. రానున్న మూడు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఉమ్మడి మెదక్ జిల్లాకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది.

ఉమ్మడి జిల్లాలో వర్షపాతం ఇలా..

సంగారెడ్డి జిల్లా.. కొండాపూర్ 27.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా.. కోహీర్ 26.5, సత్వార్ 20.5, మునిపల్లి 18.3, ద్విగాల్, మల్చెల్మ 17.3, సదాశివపేట 17, బీహెచ్ఈఎల్ 15.5, జహీరాబాద్ 15.4, అల్గోల్ 15.3, కిష్టారెడ్డిపేట, 15.0, కంది, ఆర్సీపురం, 13.0, సంగారెడ్డి 11.0, పాశమైలారం 10.3, జిన్నారం 9.3 మీ.మీ.ల వర్షం నమోదైంది. సిద్దిపేట జిల్లాలో గండిపల్లి 21.8, కట్కూర్ 16.8, సముద్రాల 12.3, కోహెడ 8.5, రేంబర్తి 8.3 మీ.మీ.ల వర్షం నమోదైంది. మెదక్ జిల్లాలో నర్సాపూర్ 8.8, నార్లపూర్ 6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

భారీ నుంచి అతి భారీ వర్షాలు

బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా బలపడిందని వాతావరణ శాఖ తెలిపింది. వాయుగుండం ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలకు రెడ్‌అలర్ట్ ప్రకటించింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించింది.

సంగారెడ్డి కంట్రోల్‌రూం నం. 08455-276155

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 31 : వర్షాల నేపథ్యంలో సంగారెడ్డి కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి శనివారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. వర్షాలకు ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్‌రూం ఫోన్ నంబర్ 08455-276155కు సమాచారం అందించి సహాయం పొందాలని ప్రజలను కోరారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా అప్రమత్తంగా ఉండాలని ఆయా శాఖల అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి పాల్గొన్నారు.

మెదక్ కంట్రోల్ రూం నంబర్ 9391942254

మెదక్ అర్బన్: మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. శనివారం కలెక్టరేట్ నుంచి మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వాతావరణశాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వర్షాలు, వరదలు సంభవించినప్పుడు లో లెవెల్ కల్వర్టులు, నీరు చేరిన రహదారులు దాటకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మత్స్యకారులు చేపల వేటలకు వెళ్లొద్దని సూచించారు. పశువులను మేతకు బయటకు వదలకుండా ఇంటిపట్టునే ఉంచాలని, వర్షాలు తగ్గే వరకు వ్యవసాయ పనులకు వెళ్లొద్దని కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండరాదని, విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని కోరారు. సీజనల్ వ్యాధుల ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు పరిశుభ్రత పాటించాలని సూచించారు. వైద్య, మున్సిపల్, పంచాయతీ శాఖల సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. అత్యవసర సేవల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం 9391942254 నంబర్‌ను ఏర్పాటు చేశామని, 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఎంహెచ్‌వో డా.శ్రీరాం, డీపీవో యాదయ్య, వ్యవసాయ అధికారి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

● తూప్రాన్ డివిజన్ కార్యాలయంలో, మాసాయిపేట తహసీల్దార్ ఆఫీసులోనూ కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో జయచంద్రారెడ్డి, మసాయిపేట తహసీల్దార్ జ్ఞానజ్యోతి తెలిపారు.

ఒకే ఆటోకు 33 సార్లు మరమ్మతులు..

ఖర్చు రూ. 4.50 లక్షలు..!

- కొత్తది కొనొచ్చు కదా..
- కౌన్సిల్ అంటే విలువ లేదా..
  మేమంతా పిచ్చోళ్లమా?
- మండిపడిన కౌన్సిలర్లు
- వాడీవేడిగా మెదక్ మున్సిపల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ సమీయొద్దీన్

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 31: ఒకే ఆటోకు 33 సార్లు మరమ్మతులు చేయించి.. రూ. 4.50 లక్షలు ఖర్చు చేసినట్టు చూపించి సభ్యులను పిచ్చోళ్లను చేస్తున్నారని మెదక్ మున్సిపల్ సమావేశంలో ఓ కౌన్సిలర్ మండిపడ్డారు. ఇంత డబ్బు వృధా చేసేకంటే కొత్తది కొనవచ్చుగా కదా.. అని వైస్ చైర్మన్, సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం శనివారం మున్సిపల్ భవనంలో చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ అధ్యక్షతన జరిగింది. చర్చ ప్రారంభం కాగానే గత సమావేశాల్లో ప్రస్తావించిన సమస్యలపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని సభ్యులు డిమాండ్ చేశారు. కౌన్సిలర్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ వాహనాల మరమ్మతుల పేరిట అధికారులు అడ్డగోలుగా నివేదికలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మరో కౌన్సిలర్ సమీయొద్దీన్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి చెందిన ఒకే ఒక్క ఆటో (నంబర్ 7952)కు ఇప్పటికే 33 సార్లు మరమ్మతులు చేసినట్టు చూపించారని, ఇందుకోసం రూ.4.50 లక్షలు ఖర్చు చేశారని పేర్కొన్నారని వివరించారు. దీంతో కౌన్సిల్ సభ్యులు ముక్కున వేలేసుకున్నారు. నిజంగానే మరమ్మతులు చేశారా? లేదా మతలబు ఉందా అని చర్చించుకున్నారు. అధికారులు ప్రవేశపెడుతున్న ఏజెండాలో స్పష్టత కొరవడిందని వైస్‌చైర్మన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కౌన్సిలర్ కృష్ణారెడ్డి ఆరోపించారు. గత కౌన్సిల్‌లో లేవనెత్తిన సమస్యలను ఇప్పటికీ పరిష్కరించకపోతే కౌన్సిల్ ఎందుకు.. సమావేశాలు ఎందుకు అని అసహనం వ్యక్తం చేశారు. సమీయొద్దీన్ మాట్లాడుతూ తన వార్డు పరిధిలో ప్రజలు విషజ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నా చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. దోమల నివారణకు, ఖాళీ స్థలాలను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ మేడి కల్యాణి మధుసూదన్ రావు కోరారు. చైర్మన్ చంద్రపాల్ మాట్లాడుతూ సమావేశంలో లేవనెత్తిన సమస్యలను పరిష్కరించకపోతే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. సభ్యులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, వర్షాల నేపథ్యంలో ప్రజా ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. రాందాస్ చౌరస్తాలోని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో జాప్యంపై కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్, కమిషనర్ జానకీరాంసాగర్, డీఈ మహేష్, కౌన్సిలర్లు ఆరేళ్ల గాయిత్రి, మేడి కల్యాణి, షంసున్నీసా బేగం, జయశ్రీ, వేదవతి, దొంతి లక్ష్మి, ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, బీమరి కిషోర్, దాయర రాజలింగం, అరికె శ్రీనివాస్, లక్ష్మీనారాయణగౌడ్, కండెల సాయిలు, ఆవారి శేఖర్, వంజరి జయరాజ్, కో-ఆప్షన్ సభ్యులు గంగాధర్, ఉమర్ తదితరులు ఉన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

సంగారెడ్డి ఎస్పీ రూపేష్



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 31 : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం జిల్లా పోలీసు శాఖ అహర్నిశలు కృషి చేస్తుందని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్ పనితీరు, పోలీసుల పాత్రపై నాల్సార్ యూనివర్సిటీ, యూనిసెఫ్, చైల్డ్ ప్రొటెక్షన్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చైల్డ్‌వెల్ఫేర్, విద్యాశాఖ సహకారంతో ప్రతీ సంవత్సరం ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మయిల్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ బాల కార్మికులకు విముక్తి కల్పిస్తున్నామన్నారు. నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బాలకృష్ణ మాట్లాడుతూ జేజేయాక్ట్ 2015ను పోలీసు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రతినిధి డేవిడ్‌రాజ్, జిల్లా వెల్ఫేర్ అధికారి లలిత కుమారి, అదనపు ఎస్పీ సంజీవరావు, రాజారెడ్డి, విజయకృష్ణ, రమేష్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు రివార్డులు

వివిధ కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన అధికారులకు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నాడు రివార్డులు అందజేశారు. రివార్డులు అందుకున్న వారిలో కోర్టు లైజనింగ్ అధికారి కె.సత్యనారాయణ, కోర్టు డ్యూటీ అధికారులు వెంకటేశ్వర్లు, విఠల్, చందూరి రాజశేఖర్, కృష్ణ, మహేందర్, కిషన్ సింగ్, యాదుల్, దేవలక్ష్మి, ఉషారాణి, శాలిని, సౌజన్య, మహేశ్వరిలు ఉన్నారు. అనంతరం ఆయన వినాయక నవరాత్రి ఉత్సవాలపై పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గణేష్ మండప నిర్వాహకులు బలవంతంగా చందాలను వసూలు చేయరాదని పేర్కొన్నారు.

నేటి నుంచి స్వచ్ఛత పఖ్వాడ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 31 : విద్యార్థుల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించడంతో పాటు సమాజంలో వారిని భాగస్వాముల్ని చేసేందుకు విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది. సర్కారు బడుల్లో ఈ నెల 1 నుంచి 15 వరకు పక్షం రోజుల పాటు స్వచ్ఛత పఖ్వాడ పేరిట కార్యక్రమాల నిర్వహణకు సమాయత్తమైంది. పిల్లలకు సమాజంపై ఉన్న బాధ్యత తెలిసేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయనున్నారు. ఇందులోభాగంగా ఈ నెల 1న ఉపాధ్యాయులు, విద్యార్థులతో స్వచ్ఛతా శపథం, 2, 3 తేదీల్లో విద్యార్థులకు శుభ్రతపై అవగాహన, 4, 5 తేదీల్లో సమాజానికి చేరువయ్యేలా కార్యక్రమాలు, 6న బడుల్లో విస్తృతంగా మొక్కలు నాటడం, 7, 8 తేదీల్లో వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీల నిర్వహణ, 9, 10 తేదీల్లో పిల్లలకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన, తప్పనిసరి చేతులు శుభ్రం చేసుకునేలా చర్యలు, 11న వ్యక్తిగత పరిశుభ్రత దినం, 12న సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థుల భాగస్వామ్యం, 13, 14 తేదీల్లో స్వచ్ఛతపై ప్రణాళిక అమలుకు సమాయత్తం, 15 న పక్షోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలమేరకు ప్రతి పాఠశాలల స్వచ్ఛత పఖ్వాడ కార్యక్రమాలు పక్కాగా అమలు జరిగేలా ఆదేశాలిచ్చామని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

చిన్న తగాదాలతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

● హుస్నాబాద్ కోర్టు న్యాయాధికారి శివరంజని


మాట్లాడుతున్న శివరంజని

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 31 : చిన్న చిన్న తగాదాలతో కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి తమ జీవితాలను నాశనం చేసుకోకూడదని హుస్నాబాద్ కోర్టు న్యాయాధికారి శివరంజని పేర్కొన్నారు. శనివారం హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో నాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సెప్టెంబర్ 28న జాతీయ మెగా లోక్‌అదాలత్ జరుగుతుందని పేర్కొన్నారు. కక్షిదారులు పట్టింపులకు పోకుండా రాజీమార్గం ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ ఎగ్గోజు సదానందం, కన్నోజు రామకృష్ణ, న్యాయవాదులు సాయిని మల్లేశం, డీకొండ ప్రవీణ్, మాజీ సర్పంచ్ బత్తిని సాయన్న, ఎంపీటీసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఉత్పత్తిదారుల నుంచి వ్యాపారులుగా మారాలి

● సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 31 : రైతులు ఉత్పత్తిదారుల నుంచి వ్యాపారులుగా మార్చడమే ఎఫ్‌పీవో(ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) ముఖ్య ఉద్దేశం అని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ఎఫ్‌పీవో కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డబ్ల్యూఆర్ రెడ్డి, ఏపీ-మాస్ సీఈవో టీసీఎస్ రెడ్డి పాల్గొన్నారు. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు సాగుభూమి వివరాలు, పంటల ఉత్పత్తి, ప్రభుత్వ పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులలో చైతన్యం రావాడానికి గ్రామాల్లో, మండలాల్లో ఎఫ్‌పీవో డైరెక్టర్లు, సీఈవోలు సభ్యులు కలిసి సమావేశాలు నిర్వహించి వీటి ప్రాముఖ్యాన్ని తెలపాలన్నారు. ప్రతీ సంవత్సరం ఎఫ్‌పీవోల జనరల్‌బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, జిల్లా అధికారులను ఆహ్వానించాలన్నారు. వారు సమస్యలు తెలిపి వారి సలహాలు, సూచనలు మేరకు నడుచుకోవాలని సూచించారు. రైతుల ఆలోచనలో మార్పు తీసుకొచ్చి మార్కెట్ డిమాండ్‌కి తగినట్టుగా వినూత్నమైన పద్ధతిలో స్థానిక అవసరాలను దృష్టి పెట్టుకొని, పంటలు వేయాలని తెలిపారు. దిగుబడిని మార్కెటింగ్ చేయడం కోసం పలు కంపెనీలతో అనుసంధానం కావాలని, దీంతో పంటలకు మంచి ధర వస్తుందని పేర్కొన్నారు. రైతులను ప్రోత్సహించడానికి విజయవంతమైన ఎఫ్‌పీవోల పనులను క్షేత్రస్థాయిలో చూపించాలన్నారు. ఈ ఎఫ్‌పీవోలను అభివృద్ధి పథంలో నడపడానికి జిల్లా యంత్రాంగం తరఫున ఎలాంటి సహాయ సహకారాలైనా అందించడానికి కట్టుబడి ఉన్నామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డీడీఎం నిఖిల్, జిల్లా ఉద్యానశాఖ అధికారి సువర్ణ, డీపీవో రాధిక, ఎల్డీఎం హరిబాబు, డీఆర్డీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య


మల్ల రవి(ఫైల్)

చిన్నశంకరంపేట, ఆగస్టు 31 : మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని అంబాజీపేట గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్ల రవి(48) కొన్ని రోజుల నుంచి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి గవ్వలపల్లి ఎక్స్ రోడ్డు వద్ద మద్యం సేవించి, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం హుటాహుటిన నార్సింగిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతిచెందినట్టు తెలిపారు. రవికి భార్య సుగుణ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు.

ఉద్యోగ విరమణ వృత్తికే కానీ వ్యక్తిత్వానికి కాదు

● సీపీ డాక్టర్ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 31 : ఉద్యోగ విరమణ వృత్తికే కానీ, వ్యక్తిత్వానికి కాదని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ అన్నారు. ఎస్‌ఐ నరెడ్ల ఇంద్రసేనా రెడ్డి పదవీవిరమణ కార్యక్రమాన్ని కమిషనర్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఇంద్రసేనారెడ్డిని అభినందించి, మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అత్యవసరం అయినప్పుడు రిటైర్డ్ పోలీస్ అధికారుల సేవలను వినియోగించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ సతీష్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఐటీ సెల్ ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కోహీర్, ఆగస్టు 31 : కోహీర్‌లో శుక్రవారం రాత్రి 30 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యాన్ని సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. కోహీర్ గ్రామానికి చెందిన అఫ్రోజ్ కోహీర్ పట్టణంలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకొని రేషన్ బియ్యం వ్యాపారాన్ని చేస్తున్నాడని సీసీఎస్ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు తనిఖీలు నిర్వహించి అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. లబ్ధిదారుల నుంచి కిలోల చొప్పున రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అద్దెకు తీసుకున్న ఓ ఇంట్లో డంపు చేసి అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సీజ్ చేసిన బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. ఈ మేరకు కోహీర్ పోలిస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

కిరాణ దుకాణం దగ్ధం.. రూ.2 లక్షల నష్టం

నారాయణఖేడ్, ఆగస్టు 31 : ఖేడ్ మండలం పైడిపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో కిరాణ దుకాణం దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పెద్దగొల్ల శంకర్ ఇంట్లోనే కిరాణ దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రోజులాగే శుక్రవారం రాత్రి దుకాణం మూసి కుటుంబీకులతోపాటు భోజనం చేసి నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో దుకాణంలో నుంచి మంటలు ఎగిసిపడుతుండగా, కుటుంబీకులు మేల్కొనడంతో పాటు చుట్టుపక్కల గృహాల వారు గుర్తించారు. మంటలను అదుపు చేశారు. దీంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు. రూ2 లక్షల నష్టం జరిగి ఉపాధిని కోల్పోయానని బాధితుడు తెలిపాడు.

నత్తనడకన ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ పనులు



హుస్నాబాద్ బస్టాండ్ ప్రధాన ద్వారం

మంత్రి పొన్నం శంకుస్థాపన చేసి ఆరునెలలు..

- ఇంకా పూర్తి కాని పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ప్లాట్ ఫామ్ నిర్మాణ పనులు

హుస్నాబాద్, ఆగస్టు 31: హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో శంకుస్థాపన జరిగి ఆరునెలల గడుస్తున్నా ఇప్పటికీ 50 శాతం పనులు కూడా పూర్తికాలేదు. మరో ఆరునెలలు గడిచినా పూర్తయ్యే అవకాశాలు కనబడటం లేదని జరుగుతున్న పనులను చూస్తే అవగతమవుతుంది. ఈ ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ పనులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.2 కోట్లు మంజూరు చేయడంతో నాలుగు దశాబ్దాల తర్వాత దీనికి మహర్దశ రాబోతుందని ఈ ప్రాంత ప్రజలు సంతోషపడ్డారు. శిథిలావస్థకు చేరిన ఈ బస్టాండ్ రూపురేఖలు మారబోతున్నాయని సంబరపడ్డారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మార్చి 8న ఈ పనులకు శంకుస్థాపన చేశారు. మార్చి 21వ తేదీ నుంచి పనులు షురూ చేశారు. అప్పటి నుంచి పనులు మందకొడిగానే జరుగుతున్నాయి.

40 ఏళ్ల తర్వాత పూర్తి దశలో ఆధునీకరణ..

హుస్నాబాద్ బస్టాండ్‌ను 1984 జూన్ 17న అప్పటి ఎమ్మెల్యే స్వర్గీయ బొప్పరాజు లక్ష్మీకాంతారావు కృషితో నాటి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి సంగంరెడ్డి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. అప్పుడు మూడువరకు ప్లాట్ ఫామ్‌లుండేవి. తదనంతరం పలుమార్లు రిపేర్లు చేశారు. మళ్లీ 14 ఆగస్టు 2017న రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. దీనికి రూ.33.50 లక్షలు మంజూరు చేశారు. అప్పుడు అందులో ఉన్న హోటల్ గదులను తొలగించి విశాలంగా చేసి ఆధునీకరించారు. ప్రస్తుతం బస్టాండ్‌లో 8 ప్లాట్ ఫామ్‌లుండగా అదనంగా మరో మూడు ప్లాట్ ఫామ్‌లు నిర్మిస్తున్నారు. 40 ఏళ్ల తర్వాత బస్టాండ్‌ను పూర్తిస్థాయిలో ఆధునీకరించుటకు నిధులు మంజూరు కాగా.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతుండటంతో ఇక్కడి ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణికుల ఇబ్బందులు..

బస్టాండ్ ఆధునీకరణ పనులకు రూ.2 కోట్లు మంజూరు కాగా.. తూర్పు వైపు ఒక ప్లాట్ ఫాం, పడమర వైపు రెండు ప్లాట్ ఫామ్‌లు నిర్మించాల్సి ఉంది. అదనంగా నిర్మిస్తున్న రెండు ప్లాట్‌ఫామ్‌ల వైపు టాయ్‌లెట్స్‌ను నిర్మాణం చేస్తున్నారు. బస్టాండ్ ముందు ఎలివేషన్ చేయాల్సి ఉంది. గ్రానైట్, రేయిలింగ్ వంటి పనులతో ఆధునీకరించాల్సి ఉండగా ఇంకా ఈ పనులు ప్రారంభం కాలేదు. బస్టాండ్ ఆవరణలో సీసీ నిర్మాణం సగం మాత్రమే చేసి మిగతాది నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మొన్నటివరకు ప్లాట్‌ఫామ్‌కు తీసిన గోతులతో ప్రయాణికులు ప్రమాదాల బారినపడ్డారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశిస్తున్నా గడువులోపు పూర్తి చేస్తామని అంటున్నారని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఈ పనులు వేగంగా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

చెక్కుల పంపిణీలో రసాభాస

● బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం



చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి, ఆగస్టు 31: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో రసాభాస నెలకొని, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు తోపులాడుకున్నారు. ఈ సంఘటన కౌడిపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో శనివారం జరిగింది. మండలంలోని 79 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, రాజకీయాలు తనకు కొత్తేమీ కాదని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని తెలపడంతో బీఆర్‌ఎస్ నాయకులు 'జై సునీతమ్మ' అని అనడంతో.. అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు 'జై రేవంత్‌రెడ్డి' అని అన్నారు. దీంతో ఇరువర్గాల నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో సభా ప్రాంగణం హోరెత్తింది. చివరకు ఒకరినొకరు తోచుకునే వరకు వచ్చింది. వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరుపార్టీల నాయకులకు సర్దిచెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వచ్చిన చెక్కులను ఎమ్మెల్యే ఎలా పంపిణీ చేస్తారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు రాజునాయక్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సార రామగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ నవీన్‌గుప్తా, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్, మాజీ సర్పంచ్ కాంతారావు, శ్యాంసుందర్‌రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, పాష తదితరులు పాల్గొన్నారు.

మృతిచెంది మూడునెలలైనా న్యాయం జరగట్లేదు

- ఉద్యోగం ఇవ్వడం లేదంటూ 'మున్సిపల్' ఎదుట ఆందోళన
- తల్లి ఫొటోతో బైఠాయించిన కుటుంబీకులు



మృతిచెందిన తల్లి ఫొటోతో ఆందోళన చేస్తున్న కుటుంబీకులు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 31: తమ తల్లి మృతిచెంది మూడునెలలైనా.. తమకు న్యాయం చేయడం లేదని కుటుంబీకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళనకు దిగారు. ఓవైపు మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరుగుతుండగా కార్యాలయం ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. మెదక్ పట్టణానికి చెందిన అయితారం దుర్గమ్మ మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తూ మే నెలలో మృతిచెందిందని కుమారులు ప్రభాకర్, గణేష్ తెలిపారు. అనంతరం తమకు రావాల్సిన ప్రయోజనాలు రాలేదని, ఈ విషయంలో మున్సిపల్ అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. కార్యాలయంలో సంప్రదిస్తే స్పందన లేదని, నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లి మృతి అనంతరం ప్రయోజనాలతో పాటు ఉద్యోగం పెద్ద కుమారుడు ప్రభాకర్‌కు ఇవ్వాలని కుటుంబసభ్యులు రాసి ఇచ్చినా.. చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఏమన్నంటే కలెక్టర్ కార్యాలయానికి లేఖ రాశామని.. అక్కడ చూసుకోవాలని ఓ అధికారి అలసత్వ సమాధానమిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మృతికి ముందు అనారోగ్యానికి గురవడంతో సుమారు రూ.6 లక్షలు ఖర్చు చేశామని.. అందుకు సంబంధించి కాగితాలు ఇవ్వడం లేదని, ప్రశ్నిస్తే మున్సిపల్ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని అధికారులు దుర్భాషలాడుతున్నారని వాపోయారు.

తమ వద్ద పెండింగ్ లేదు

అయితారం దుర్గమ్మ మృతి అనంతరం కుటుంబీకులకు రావాల్సిన ప్రయోజనాల విషయంలో అన్ని చర్యలు తీసుకున్నామని కమిషనర్ జానకీరాంసాగర్ తెలిపారు. ఇప్పటికే కొన్ని ఫైళ్లు ఖజానా కార్యాలయానికి, మరికొన్ని ఫైళ్లు కలెక్టర్ కార్యాలయానికి పంపడం జరిగిందన్నారు. వీటిపై అదనపు కలెక్టర్ సంతకాలు కూడా పూర్తయ్యాయని వివరించారు. అనవసరంగా మృతురాలి కుటుంబీకులు ప్రతిరోజు మున్సిపల్ సిబ్బందితో దుర్భాషలాడుతున్నారని కమిషనర్ తెలిపారు. తమ వద్ద వారికి రావాల్సిన ప్రయోజనాల విషయంలో ఎటువంటి పెండింగ్ ఫైళ్లు లేకపోగా, వాటి కోసం తమ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారని వివరణ ఇచ్చారు.

జిల్లా న్యాయాధికారిని కలిసిన సిద్దిపేట కలెక్టర్



జిల్లా న్యాయాధికారి సాయిరమాదేవికి పూలమొక్కను అందజేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట క్రైం, ఆగస్టు 31: సిద్దిపేట జిల్లా న్యాయాధికారి కె.సాయిరమాదేవిని సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోర్టు కాంప్లెక్స్‌లో కలెక్టర్ మనుచౌదరి శనివారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న న్యాయ వ్యవస్థకు సంబంధించిన విషయాల గురించి కాసేపు చర్చించారు.

దోస్త్ మేరా దోస్త్..!

● గేదెపై శునకం సవారీ



రేగోడు గ్రామ సమీపంలో గేదెపై కూర్చున్న శునకం

రేగోడు, ఆగస్టు 31: అప్పుడప్పుడు జంతువులు తమ జాతి వైరుధ్యం, వైరాన్ని మరిచిపోయి స్నేహంగా ఉంటాయి. ఆప్యాయంగా మెలుగుతుంటాయి.. అలాంటి ఘటనే మెదక్ జిల్లా రేగోడు మండలంలో చోటు చేసుకున్నది. శనివారం రేగోడు పరిధిలోని పెద్దశంకరంపేట రహదారిపై ఓ గేదెపై శునకం కూర్చుని తిరగడం పలువురిని ఆశ్చర్యపరిచింది. ఈ దృశ్యం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కడంతో క్లిక్‌మనిపించింది.





సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధాకృష్ణ చౌహాన్, జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు.

సెక్స్ వర్కర్ల సంక్షేమం కోసం కృషి

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 31: సెక్స్ వర్కర్ల ప్రాథమిక హక్కులకు భంగం కలుగకుండా శాంతియుత సమాజాన్ని నిర్మించేందుకు న్యాయవాదులు, పోలీసులు, వివిధ సంఘాల నాయకులు కృషిచేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధాకృష్ణ చౌహాన్ కోరారు. సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం సెక్స్ వర్కర్ల హక్కులపై సంగ్రామ్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్స్ కార్మికుల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కమిటీ చేసిన సిఫార్సుల గురించి వివరించారు. శాంతిభద్రతల విధివిధానాల్లో విద్య ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. జిల్లా అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు మాట్లాడుతూ వేశ్య వృత్తి యుగయుగాలుగా కొనసాగుతుందని, ఈ వృత్తిలో ఉన్న మహిళలకు ఇతర జీవనోపాధి చూపించి వారి జీవన విధానాల్లో మార్పు కోసం పోలీసుశాఖ కృషి చేస్తున్నదన్నారు. జిల్లా మహిళా శిశుశాఖ అధికారి లలితకుమారి మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్, హిజ్రాల సంక్షేమం కోసం తాము కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ జ్యోతి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అవంతిక తంగెళ్లతో పాటు పోలీసు, విద్యాశాఖ అధికారులు, సఖి కేంద్రం నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

ఐడీఎస్ఎంటీ ఫేజ్-2కు న్యాయం చేయండి

● ఆందోళనకు దిగిన దరఖాస్తుదారులు ● ఈనెలాఖరులోగా పరిష్కరిస్తామన్న చైర్మన్ చంద్రపాల్



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 31: చిన్న, మధ్యస్థ పట్టణాల సమగ్ర అభివృద్ధి (ఐడీఎస్ఎంటీ) ఫేజ్-2 బాధితులకు న్యాయం చేయాలంటూ లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. శనివారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరిగిన అనంతరం చైర్మన్ చంద్రపాల్, పాలకవర్గాన్ని వారు కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఫేజ్ -1లో స్థలాలు దక్కని వారితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారు ఆందోళనకు దిగారు. ఎన్నోఏళ్లుగా తమకు స్థలాలు కేటాయించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫేజ్-1లో 21 మందికి పైగా, ఫేజ్-2లో 40 మందికి స్థలాలు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. కొన్నిరోజులుగా తామంతా ఏకమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చామని చెప్పారు. నేడు కౌన్సిల్ సమావేశమున్నందున కార్యాలయానికి వచ్చినట్లు తెలిపారు. సమావేశం ముగియగానే చైర్మన్ కలిసి తమ సమస్యను తెలియజేశామన్నారు. తమకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని కోరగా చైర్మన్ స్పందిస్తూ తామంతా అదే పనిలో ఉన్నామని, ఈనెలాఖరులోగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు హామీఇచ్చారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతిచెందిన పెంటప్ప

జహీరాబాద్, ఆగస్టు 31: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామానికి చెందిన పెంటప్ప(65) తన వ్యవసాయ పొలంలో పనులను చేసుకునేందుకు సైకిల్‌పై వెళ్తున్నాడు. మండలంలోని గోవలస్‌పల్లి చౌరస్తాలో 65వ నంబరు జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా.. శనివారం మధ్యాహ్నం జహీరాబాద్ నుంచి వస్తున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో పెంటప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరిచారు.

కారును ఢీకొన్న బస్సు

● నలుగురికి తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

హత్నూర, ఆగస్టు 31: ఆర్టీసీ బస్సు కారును ఢీకొనడంతో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం సిరిపురం గ్రామ శివారులో శనివారం చోటు చేసుకున్నది. గుమ్మడిదల మండలం దాదారం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి అతని భార్య నర్మద, కూతురు శ్రీనిధి, కుమారుడు, తల్లి భ్రమరాంబతో కలిసి నర్సాపూర్ నుంచి మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామ శివారులోని చాముండేశ్వరీదేవి దర్శనానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో సిరిపుర గ్రామ శివారులోకి వెళ్లగానే జోగిపేట నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు వీరి కారును ఒక్కసారిగా ఢీకొట్టింది. దీంతో కారు బోల్తా పడి నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గాయపడ్డ నలుగురిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు రాలేదన్నారు.

ఇంటి పన్నుల తగ్గింపునకు తీర్మానం

● తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ

తూప్రాన్, ఆగస్టు 31: ఇంటి పన్నులను తగ్గించాలని తీర్మానం చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ పేర్కొన్నారు. శనివారం ఓ ప్రకటన విడుదల చేస్తూ.. 2021లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం భువన్ సర్వేతో ఇళ్లకు కొలతలు నిర్వహించి జియో ట్యాగింగ్ చేస్తూ అప్‌డేట్ చేయాలని ఆదేశాలు జారీచేసిందన్నారు. ఆ ఆదేశాలతో 2021లో భువన్ అప్‌డేట్ జరిగి, సాంకేతిక కారణాలతో ఇంటి పన్నులు అప్‌డేట్ కాలేదన్నారు. వీటిని సీ అండ్ డీఎంఏ పురపాలక పరిపాలనశాఖ అసెస్‌మెంట్ పన్నులు అప్‌డేట్ చేయాలని ఆదేశాలు జారీచేసినట్లు పేర్కొన్నారు. ఆ ఆదేశాల మేరకు మిగిలిపోయిన అసెస్‌మెంట్లకు ఇంటి పన్నులు అప్‌డేట్ చేసినట్లు వివరించారు. పెరిగిన ఇంటి పన్నులపై ఈనెల 24న జరిగిన సాధారణ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు పన్నులు తగ్గించుటకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపేందుకు ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు వివరించారు. ఇంటి పన్నుల పెంపుపై అభ్యంతరాలు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని జ్యోతికృష్ణ సూచించారు.

చాకరిమెట్లలో శ్రావణ శోభ



చాకరిమెట్ల ఆలయంలోని హోమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట, ఆగస్టు 31: శివ్వంపేట మండల పరిధి చిన్నగొట్టిముక్ల గ్రామంలోని చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో స్వయంభుగా వెలసిన ప్రముఖ క్షేత్రం సహకార ఆంజనేయస్వామి ఆలయంలో చివరి శనివారాన్ని పురస్కరించుకుని శ్రావణ శోభ సంతరించుకున్నది. ఆలయ చైర్మన్ ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, చందన విశేష పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామిని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దర్శించుకుని హోమంలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి సార శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి దేవదత్తశర్మ, పూజారులు ప్రభు రాజశర్మ పాల్గొన్నారు.

రామలింగేశ్వర గుట్టకు పాదయాత్ర

కల్హేర్, ఆగస్టు 31: శ్రావణమాసం ఆఖరి శనివారం కావడంతో మండల పరిధిలోని మాసాన్‌పల్లి చౌరస్తా సమీపంలోని బ్రాహ్మణపల్లి అంజనాద్రి ఆలయ వ్యవస్థాపకుడు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులు పాదయాత్ర చేపట్టారు. సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలకు చెందిన భక్తుల ఆరాధ్యదైవమైన కామారెడ్డి జిల్లా పిట్లం మండల పరిధిలోని రామలింగేశ్వరగుట్ట వరకు పాదయాత్ర చేపట్టారు. సీతారామ లక్ష్మణ, ఆంజనేయుడి ఉత్సవ విగ్రహాలతో చేపట్టిన పాదయాత్ర బ్రాహ్మణపల్లి, నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా, ఇబ్రాహీంపూర్, మల్హార్, అన్నారం, కిష్టాపూర్ గ్రామాలమీదుగా రామలింగేశ్వరగుట్టకు పాదయాత్ర చేరుకుంది. కల్హేర్ మండల పరిధిలోని మాసాన్‌పల్లి, మహదేవ్‌పల్లి, దేవునిపల్లి, కల్హేర్, రాపర్తి, ఖానాపూర్(బి), బాచేపల్లి, కామారెడ్డి జిల్లా బ్రాహ్మణపల్లి, వెలగనూర్, నర్సింగ్‌రావ్‌పల్లి, ఆరేడ్, అచ్చంపేట, నిజాంసాగర్ గ్రామాల భక్తులు పాల్గొన్నారు. పాదయాత్ర మధ్యలో భక్తులకు మల్హార్ గ్రామానికి చెందిన ముస్లింలు పండ్లు, మంచినీళ్లు అందజేసి మతసామరస్యాన్ని చాటుకున్నారు.

హనుమాన్ ఆలయంలో భక్తుల కిటకిట

నారాయణఖేడ్, ఆగస్టు 31: నారాయణఖేడ్ మండలం కొండాపూర్ హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులు దర్శనం కోసం పోటెత్తారు. శ్రావణ మాసంలో చివరి శనివారం, శనిత్రయోదశి కావడంతో తెల్లవారుజామునే ఆలయానికి తరలివచ్చారు. ఆలయంలో అభిషేకం, చందనం, మహాహారతి నిర్వహించారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ ఆశీస్సులు అందజేశారు. కాగా ఖేడ్ పట్టణంలోని కల్పనా హనుమాన్ ఆలయంలోనూ భక్తులు దర్శనం కోసం వచ్చారు.

సెప్టెంబరు 2న కుంకుమార్చన

నారాయణఖేడ్ పట్టణంలోని దత్తాత్రేయ మందిరంలో శ్రావణమాసం చివరి సోమవారం అమావాస్యను పురస్కరించుకుని సాయంత్రం 5 గంటల నుంచి ఉమాపార్థివ లింగార్చన సహిత కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఖేడ్‌లోని కాశీనాథ్ ఆలయంలో సెప్టెంబరు 2న శ్రావణ మాసం చివరిరోజు సోమావతి అమావాస్య రుద్రయాగం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అర్చకుడు గురురాజ్‌జ్యోషి తెలిపారు.



నారాయణఖేడ్: బీచ్కుంద పీఠాధిపతి సోమాయప్ప ఆశీస్సులు పొందుతున్న ఎంపీ సురేష్‌షెట్కార్

సోమాయప్ప ఆశీస్సులు పొందిన ఎంపీ

జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని బీచ్కుంద మఠాన్ని సందర్శించారు. బీచ్కుంద పీఠాధిపతి సోమాయప్ప ఎంపీ సురేష్ షెట్కార్‌కు ఆశీస్సులు అందజేశారు. ఖేడ్ శివారులోని ఎంపీపీ కార్యాలయం ఎదుట రాంరావు మహరాజ్ ట్రస్టులో ఏర్పాటు చేసిన మండపంలో ఆదివారం నుంచి జగదాంబ భవానీ మాత 41 రోజుల దీక్షధారణ నిర్వహించనున్నట్లు బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ అన్నారు.

ఆలయాల్లో శనిత్రయోదశి పూజలు

ఝరాసంగం, ఆగస్టు 31: మండల పరిధిలోని ఏడాకులపల్లి, బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో శనివారం శనిత్రయోదశి సందర్భంగా భక్తులు తైలం, నువ్వులు, నల్లవస్త్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఏడాకులపల్లి గ్రామ శివారులోని సప్తపూరి శనిఘాటులో పూజలు చేసి, మొక్కుకున్నారు.

నల్తూరులో నిర్విరామ భజన

జిన్నారం, ఆగస్టు 31: నల్తూరులోని ఆలయంలో ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 3 వరకు భక్తులు నిర్విరామ భజన నిర్వహిస్తున్నారు. ఉదయం 6 నుంచి 12, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6, 6 నుంచి రాత్రి 12 గంటల వరకు, 12 నుంచి ఉదయం 6 గంటల వరకు నాలుగు బృందాలుగా భజన చేపట్టారు. శనివారంలో మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

భద్రత, భరోసా కోసమే కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం

● మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్

మెదక్ అర్బన్, ఆగస్టు 31: ప్రజల భద్రత, భరోసా కోసమే కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని అవుసులపల్లిలో కమ్యూనిటీ కనెక్ట్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం ద్వారా నేరరహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పోలీసు యంత్రాంగం దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగా ప్రజలకు అభద్రతా భావం లేకుండా ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 31: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలు వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన జొన్నగడ్డల రామవ్వ(70)కు ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే రామవ్వ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. శనివారం ఉదయం పెద్ద కుమారుడు తల్లి ఆచూకీ కోసం వెతుకుతుండగా.. గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. రామవ్వ కొంతకాలంలో అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెందుతున్నట్లు పెద్ద కుమారుడు వెంకటయ్య తెలిపాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుస్నాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీస్‌లో చోరీకి యత్నం

హవేళీఘణపూర్, ఆగస్టు 31: మెదక్ కలెక్టర్ కార్యాలయంలోని రెండో అంతస్తులో ఉన్న జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి కార్యాలయంలో దుండగుడు చోరీకి యత్నించినట్లు హవేళీఘణపూర్ ఎస్ఐ సత్యనారాయణ శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రెండో ఫ్లోర్‌లో ఉన్న జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసులో దొంగతనం చేసేందుకు తలుపులు పగులగొట్టే ప్రయత్నం చేశాడు. అవి రాకపోవడంతో వెనక్కి వెళ్లిపోయాడని ఎస్ఐ తెలిపారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో మొక్కలు నాటిన వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు

కలెక్టరేట్‌లో 'ఏక్ పేడ్.. మా కే నామ్'

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 31: సంగారెడ్డి కలెక్టరేట్ ఆవరణలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జిల్లా సంక్షేమాధికారి లలితాకుమారి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటామన్నారు. సోమవారం నుంచి పోషణ మాసం ప్రారంభమవుతుందని, జిల్లాలో ప్రతి రోజూ సెప్టెంబర్ నెల మొత్తం 30 రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో చంద్రకళ, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ సౌమ్య, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి 30 పోలీసు చట్టం అమలు

సంగారెడ్డి క్రైం/ మెదక్ అర్బన్, ఆగస్టు 31: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సెప్టెంబరు 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్టు 1861 అమలులో ఉంటుందని సంగారెడ్డి, మెదక్ జిల్లాల ఎస్పీలు చెన్నూరి రూపేష్, ఉదయ్‌కుమార్‌రెడ్డి శనివారం విడుదల చేసిన వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించకూడదని సూచించారు. ఒకవేళ అనుమతి లేకుండా ఎవరైనా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులతో సహకరించాలని కోరారు.

జీజీహెచ్ ప్రహరీ కూలినా పట్టింపేదీ?

● రక్షణ కరువైందని రోగుల బంధువుల ఆందోళన

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 31: సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రహరీ ఓ పక్క కూలినా పట్టించుకునేవారే లేరా స్థానికులు ప్రశ్నిస్తున్నారు. జీజీహెచ్ ప్రధాన ద్వారం సమీపంలోని ఫైర్ స్టేషన్‌కు వెళ్లే మార్గంలోని ఈ కంపౌండ్ వాల్ ఓ పక్క కూలి నేలకొరిగింది. ఈ ఘటన జరిగి నెల రోజులు గడిచినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఫలితంగా ఈ మార్గం గుండా గుర్తు తెలియని వ్యక్తులు ఆస్పత్రిలోనికి ప్రవేశించే అవకాశాలున్నాయని రోగుల బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా నెల రోజుల క్రితం ఓ వ్యక్తి అర్ధరాత్రి తన కారుతో కాంపౌండ్ వాల్‌ను ఢీ కొనడంతో గోడ కూలిందన్నారు. ఈ విషయం పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని వివరించారు. సదరు వ్యక్తి కూలిన గోడను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని తెలిపారు. ఈ విషయాన్ని మరోసారి పోలీసుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.



సంగారెడ్డిలో కూలిన జీజీహెచ్ ప్రహరీ

సమానహక్కులు కల్పించడానికే సివిల్‌రైట్స్ డే

కల్హేర్, ఆగస్టు 31: ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కల్పించిన సమానహక్కులపై అవగాహన కల్పించేందుకే ప్రతీ నెలాఖరు రోజున సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్నట్లు నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి పేర్కొన్నారు. శనివారం మండలంలోని టీబీపేట్‌లో, మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. టీబీపేట్‌లోని ఎస్సీ కాలనీలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అంటరానితనం పాటించినా, ప్రోత్సహించినా నేరమని, ఇలాంటి సంఘటనలు ఇంకా కొనసాగితే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆర్డీవో అశోక చక్రవర్తి సూచించారు. కార్యక్రమంలో కల్హేర్ తహసీల్దార్ శివశ్రీనివాస్, ఏఎస్ఐ అంజయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లేశం, నాయకులు బండారి సాయిలు తదితరులు పాల్గొన్నారు. సిర్గాపూర్ కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాశంకర్, ఏఎస్ఐ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

●వెల్దుర్తి: మండలంలోని ఉప్పులింగాపూర్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ లాయక్‌అలీ మాట్లాడుతూ.. చట్టాలపై తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా మరొకరి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుల పొడగింపు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 31 : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్‌కు(ఎన్ఎంఎంఎస్) ఎంపికైన ఫ్రెష్, రెన్యూవల్ అభ్యర్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అక్టోబరు 15 లోపు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వెరిఫికేషన్ చేయాలన్నారు.

గ్రామ పంచాయతీకి వీధి దీపాల వితరణ



పంచాయతీ కార్యదర్శికి విద్యుత్ దీపాలు అందజేస్తున్న రవికుమార్

కౌడిపల్లి, ఆగస్టు 31: మండలంలోని మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన గొల్ల రవికుమార్ యాదవ్ గ్రామపంచాయతీకి తనవంతు సహకారంగా రూ.లక్షా 20 వేల విలువైన విద్యుత్ దీపాలను అందజేశారు. ఈ మేరకు శనివారం ఎంపీడీవో కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శికి విద్యుత్‌దీపాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధి కోసం తాను మరింత సహకారాన్ని అందజేస్తానని తెలిపారు. ఆయన వెంట గ్రామస్థులు బురుగారి వెంకన్న, యాదుల్, యాదగౌడ్, యువకులు ఉన్నారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 31 : రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. సంగారెడ్డి జిల్లాకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసిన నేపథ్యంతో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రతీక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అధికారులను కోరారు.

ఉత్తమ విధి నిర్వహణతో మంచి గుర్తింపు



వెంకట మధుసూదన్‌ను జ్ఞాపికతో సన్మానిస్తున్న డీఈవో

తూప్రాన్, ఆగస్టు 31: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ప్రతీ ప్రభుత్వ ఉద్యోగిని ప్రజలు శాశ్వతంగా గుర్తించుకుంటారని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. శనివారం తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ములుగు వెంకటమధుసూదన్ ఉద్యోగవిరమణ అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సాధారణమని, వారు చేసిన సేవలు మాత్రం ఎప్పటికీ గుర్తుంటాయన్నారు. కార్యక్రమంలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవోలు బుచ్యానాయక్, నీలకంఠం, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

చండిలో ఉపాధ్యాయుడికి వీడ్కోలు



ఉపాధ్యాయుడు వామన్‌శర్మను సన్మానిస్తున్న విద్యార్థులు

శివ్వంపేట, ఆగస్టు 31: పన్నెండేళ్లుగా ఒకే పాఠశాలలో అంకితభావంతో విధులు నిర్వహించి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన తెలుగు పండిత్ ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్తుండడంతో శనివారం విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. మండల పరిధిలోని చండి ఉన్నత పాఠశాలలో తెలుగు పండిత్ ఉపాధ్యాయుడు వామన్‌శర్మ పాంబండ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. దీంతో శనివారం విద్యార్థులు ఉపాధ్యాయులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు దయానందరెడ్డి, ఉపాధ్యాయురాలు అరుణ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పదు: ఎంపీడీవో



ఉద్యోగ విరమణ పొందిన మహ్మద్ యూసుఫ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

టేక్మాల్, ఆగస్టు 31: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పదని ఎంపీడీవో రియాజుద్దీన్ అన్నారు. శనివారం టేక్మాల్ మండల పరిషత్ కార్యాలయంలో కొంత కాలంగా విధులు నిర్వహించిన సీనియర్ అసిస్టెంట్ మహ్మద్ యూసుఫ్ ఉద్యోగ విరమణ సందర్భంగా కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ చింత స్వప్న రవి, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరై యూసుఫ్‌ను ఘనంగా సన్మానించారు.

విధి నిర్వహణలో చేసిన సేవలే తీపి గుర్తులు



ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్టీసీ డీఎం, సిబ్బంది

నారాయణఖేడ్, ఆగస్టు 31: ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆర్టీసీ డీఎం మల్లేశయ్య పేర్కొన్నారు. శనివారం డిపోలో విధులు నిర్వహించి విరమణ పొందిన కంట్రోలర్ జనార్దన్, డ్రైవర్ పరీద్‌లకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గతంలో డీఎంగాపని చేసిన మూర్తి, అసిస్టెంట్ డిపోమేనేజర్ నర్సింహులు, ఏఎంఎఫ్ దశరథ్‌రావు, టీఐత్రి నందులాల్, విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ, మార్కెటింగ్ మేనేజర్‌పాండు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్‌జడ్జి సూరిక్రిష్ణ

జహీరాబాద్, ఆగస్టు 31: విద్యార్థులు చదువుతోపాటు చట్టాలపై అవగాహనను పెంచుకోవాలని సీనియర్ సివిల్‌జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ సూరిక్రిష్ణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మార్‌హెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి చదువుతో పాటు సాధారణచట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, న్యాయవాదులు శ్రీనివాస్‌కన్నా, సందీప్, ప్రవీణ్, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదారం పాఠశాలలో మిషన్ శక్తిపై అవగాహన

జిన్నారం, ఆగస్టు 31: మాదారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోలీసుల ఆధ్వర్యంలో మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం బొల్లారం పోలీసులు జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా బాలల హక్కులు, పోక్సో చట్టం, ఆన్‌లైన్ మోసాలు, పిల్లల అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల నిర్మూలన, ఆరోగ్యం, కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు యాదగిరి, శ్రీలత, ఎస్ఐ దశరథ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి: డీఎస్పీ



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ సుభాష్ చంద్రబోస్

నర్సాపూర్, ఆగస్టు 31: నేటి యువత సెల్‌ఫోన్ అతిగా వాడి అనర్థాలను కొని తెచ్చుకుంటున్నారని, వాటి వాడకాన్ని తగ్గించుకోవాలని డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్ సూచించారు. శనివారం మండలంలోని పెద్దచింతకుంట సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పోలీసుశాఖ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ దామోదర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మెదక్ డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్ హాజరై మాట్లాడారు. సెల్‌ఫోన్‌ను అతిగా వాడటం వల్ల లక్ష్యం దెబ్బతినడమే కాకుండా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయే ప్రమాదముందన్నారు. పోలీస్ కళాబృందం చెందిన సురేందర్ ఆధ్వర్యంలో కళా ప్రదర్శన, పాటల ద్వారా చదువుతో పాటు మంచి సంస్కారం అలవర్చుకుని జీవితాన్ని ఉన్నతంగా మార్చే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దామోదర్‌తో పాటు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సురేష్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాస్, ఏఎస్ఐ కృష్ణ, అధ్యాపక బృందం ఎ.శ్రీనివాస్, రుక్మిణి, రమేష్, హేమంత్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారుకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, ఆగస్టు 31: సీఎం సహాయనిధి పథకాన్ని నిరుపేద కుటుంబాలు సద్వినియోగం చేసుకుని కార్పొరేట్‌స్థాయి వైద్యాన్ని పొందాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో న్యాల్‌కల్, ఝరాసంగం మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. న్యాల్‌కల్ మండలం మెటల్‌కుంట గ్రామానికి చెందిన రాజేందర్‌రెడ్డికి రూ.38వేల చెక్కు, ఝరాసంగం మండలంలోని గుంతమర్పల్లికి చెందిన నవీన్‌కు రూ.29వేల విలువచేసే సీఎం సహాయనిధి చెక్కును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఝరాసంగం మండలపార్టీ అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో ప్రజలకు ఊరట



చిలప్‌చెడ్‌లో లబ్ధిదారుకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న సునీతారెడ్డి

చిలప్‌చెడ్, ఆగస్టు 31: సీఎం రిలీఫ్‌ఫండ్ వల్ల ఎంతో మంది నిరుపేదలకు ఊరట చేకూరుతున్నదని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 40మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోనే అత్యధికంగా నర్సాపూర్ నియోజకవర్గానికి 494 చెక్కులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, వీరాస్వామి, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లయ్య, నాయకులు నరేందర్‌రెడ్డి, దుర్గారెడ్డి, సయ్యద్ హుస్సేన్, అనంతరామాగౌడ్, షఫీ, నర్సింహారెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించాలి: తపస్

చేగుంట, ఆగస్టు 31: ఉపాధ్యాయులకు బదిలీతో పాటు ప్రమోషన్లు కల్పించాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ పేర్కొన్నారు. శనివారం నార్సింగి మండల కేంద్రంలోని తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం ఏకీకృత సర్వీస్ రూల్‌ను క్లియర్ చేసి డిప్యూటీ ఈవో, ఎంఈవో జూనియర్ లెక్చరర్, డైట్ లెక్చరర్ ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ మండలాధ్యక్షుడు మల్లేష్, భాస్కర్, కోశాధికారి రాఘవేందర్, మహేష్, వెంకట్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

'పెన్షన్ విద్రోహదినానికి తరలిరండి'

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 31: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహదినం సందర్భంగా సంగారెడ్డిలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ ఐక్యవేదిక (టీజీఈజేఏసీ) పిలుపు మేరకు ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహం నుంచి నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నిరసనలో ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

● సంగారెడ్డి అర్బన్: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగే నిరసన ప్రదర్శకు ఉద్యోగ ఉపాధ్యాయులు భారీగా తరలిరావాలని జాక్టో చైర్మన్ సయ్యద్‌సాబేర్‌అలీ కోరారు. సంగారెడ్డిలో శనివారం ఆయన మాట్లాడారు. ఈ నెల 1 న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా సంగారెడ్డిలో చేపట్టే నిరసన ప్రదర్శన, ధర్నాకు జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

● నిజాంపేట: సీపీఎస్ పద్ధతిని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఆర్టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని తిప్పనగుల్లలో శనివారం ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో మండల నూతన ప్రధాన కార్యదర్శిగా తిప్పన్నగుళ్ల పాఠశాల ఉపాధ్యాయుడు సిద్దుల మహేశ్వర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి టీఆర్టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలయ్య హాజరై మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక కర్షక సంఘాలన్నీ సంయుక్తంగా నిర్వహిస్తున్న పెన్షన్ విద్రోహ దినం సెప్టెంబర్ 1వ తేదీన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

హైడ్రా పేరుతో పేదల జోలికి వస్తే సహించం: సీపీఎం

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 31: చెరువులు, కుంటల పరిరక్షణకు హైడ్రాను స్వాగతిస్తున్నామని, కానీ హైడ్రా పేరుతో పేదల జోలికి వస్తే మాత్రం సహించబోమని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ స్పష్టం చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు పటాన్‌చెరు, అమీన్‌పూర్‌లలో పేదలు ఎన్నోఏళ్లుగా ఇళ్లను నిర్మించుకుని జీవిస్తున్నారన్నారు. వారిని అక్రమణల పేరుతో నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని విమర్శించారు. హైడ్రా పేరుతో ప్రత్యామ్నాయం చూపకుండా పేదలు, మధ్యతరగతి వారి ఇళ్లను కూల్చడం దారుణమన్నారు. పేదల ఇళ్లను తొలగించే ముందు వారికి పక్కా ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కోహీర్, ఆగస్టు31: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మండలంలో కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోహీర్ తహసీల్దార్ బాల శంకర్ పేర్కొన్నారు. మండలంలోని గొడిగర్‌పల్లి గ్రామ పరిధిలోని పెద్ద పెద్దవాగు పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన రెవెన్యూ అధికారులకు సమాచారం అందజేయాలని కోరారు.

టీపీటీఎఫ్ కార్యవర్గం

జిన్నారం, ఆగస్టు 31: జిన్నారం మండల టీపీటీఎఫ్ ఉపాధ్యాయ నూతన కమిటీని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా రాంచందర్, ఉపాధ్యక్షులు శ్రీధర్‌బాబు, పద్మ, ప్రధాన కార్యదర్శులు రాంచందర్, కార్యదర్శులు వెంకటేశం, సుజాత, దయాకర్, జిల్లా కౌన్సిలర్లుగా ఆనందం, రమేష్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విద్యార్థులకు వ్యాధులపై అవగాహన

జిన్నారం, ఆగస్టు 31: బొల్లారం మోడల్ పాఠశాలలో స్వచ్ఛదనం-పచ్చదనం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రోజారాణి, పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ నిర్మలారెడ్డి, ప్రిన్సిపాల్ బాలకృష్ణలు పాల్గొన్నారు. విద్యార్థులు ఆరోగ్య పరిరక్షణ, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.

వసతి గృహాల్లో ఆరోగ్య పరీక్షలు

కోహీర్, ఆగస్టు 31: కోహీర్‌లోని మైనారిటీ గురుకుల పాఠశాలతో పాటు సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో శనివారం బిలాల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నరేందర్, వైద్య సిబ్బంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. శనివారం ఆయా వసతి గృహాల్లో వైద్య సిబ్బంది విద్యార్థుల ఆరోగ్య విషయాలను తెలుసుకొని పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

రేగోడు ఆగస్టు 31: గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలు జరగవని రేగోడు ఎస్ఐ పోచయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఆర్ ఇటిక్యాల గ్రామంలోని హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కురుస్తున్న వర్షాలకు విద్యుత్ వైర్ల వద్ద విద్యుత్ ఇనుప స్తంభాల వద్ద జాగ్రత్తగా ఉండాలని, చెరువులు, కుంటలు బ్రిడ్జిల వద్ద మండల ప్రజలు వ్యవసాయదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఫిరోజ్, ఏఎస్ఐ మల్లయ్య గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో విజేతలకు బహుమతుల ప్రదానం



పుల్కల్: అండర్ 17 విభాగంలో కబడ్డీలో మొదటి బహుమతి సాధించిన పుల్కల్ బాలికల జట్టు



నారాయణఖేడ్: నిజాంపేటలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పుల్‌కల్, ఆగస్టు 31: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడోత్సవాల్లో విజేతలుగా నిలిచిన జట్లకు శనివారం బహుమతులను అందజేశారు. వర్షం కారణంగా రెండు రోజుల క్రితం నిలిపివేసిన ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాల ఫైనల్ పోటీలు శనివారం నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అండర్ 17 విభాగంలో కబడ్డీలో ప్రథమ స్థానంలో పుల్కల్ కేజీబీవీ బాలికల జట్టు నిలిచింది. వాలీబాల్ మొదటి బహుమతిని జడ్పీహెచ్‌ఎస్ పుల్కల్ బాలికల జట్టు కైవసం చేసుకోగా, వాలీబాల్ ప్రథమ బహుమతిని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ సింగూరు బాలుర జట్టు గెలుపొందింది. ఖోఖో ప్రథమ బహుమతిని జడ్పీహెచ్‌ఎస్ పుల్కల్ బాలికల జట్టు, రెండో బహుమతిని టీజీఎంఎస్ ఇస్సాపూర్ బాలికల జట్లు గెలుచుకున్నాయి. కాగా, అండర్ 14 విభాగంలో ప్రథమ బహుమతిని జడ్పీహెచ్‌ఎస్ గొంగ్లూరు బాలికల జట్టు, కబడ్డీలో టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ సింగూరు బాలుర జట్టు ప్రథమ, పుల్కల్ జడ్పీహెచ్‌ఎస్ బాలుర జట్టు రెండో బహుమతిని గెలుచుకున్నాయి. వాలీబాల్ అండర్ 14 విభాగంలో జడ్పీహెచ్‌ఎస్ గొంగ్లూరుకు దక్కగా, ముదిమాణిక్యంకు రెండో బహుమతి దక్కింది. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుల్కల్ ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ హాజరై బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

● నారాయణఖేడ్: నిజాంపేటలో రెండురోజులుగా నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో గెలుపొందినవారికి శనివారం పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌రావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ నిజాంపేటలో నిర్వహించిన క్రీడాపోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 100మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో పీడీలు విఠల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

● పలు మండలాల్లో సభ్యత్వ నమోదుపై సన్నాహక సమావేశాలు



సంగారెడ్డిలో బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న మండల నాయకులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 31: బీజేపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, సంగారెడ్డి మండల ఇన్‌చార్జి ఈటల చంద్రశేఖర్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని పార్టీ కార్యాలయంలో శనివారం బీజేపీ సభ్యత్వాల నమోదుకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని మండల అధ్యక్షుడు పాపన్న అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సీట్లు గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేందర్, నాయకులు పాల్గొన్నారు.

● పుల్‌కల్: పుల్కల్‌లో శనివారం నిర్వహించిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశానికి బీజేపీ ఓబీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి పుల్లంగారి సురేందర్ ముదిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పండరి, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు శ్రీశైలం, ఓబీసీమోర్చా మండల అధ్యక్షుడు నర్సింహులు, నాయకులు పాల్గొన్నారు.

● నారాయణఖేడ్: పార్టీ సభ్యత్వ నమోదులో భాగంగా అత్యధిక సభ్యత్వాలు చేయించి సత్తా చాటాలని ఖేడ్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రజనీకాంత్ పేర్కొన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు డ్రైవ్ -2024 లో భాగంగా శనివారం ఖేడ్‌లో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, బూత్‌స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు సాయిరాం, మండల అధ్యక్షుడు దశరత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● చిన్నశంకరంపేట: బీజేపీ బలోపేతమే లక్ష్యంగా అధిక సభ్యత్వాలు నమోదు చేయించేందుకు కృషి చేస్తున్నట్లు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దశరథం పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబరు 1న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు బీజేపీ సభ్యత్వనమోదు చేసుకునేందుకు 8800002024 నంబర్‌కు మిస్‌కాల్ చేయాలని సూచించారు.

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

టేక్మాల్, ఆగస్టు 31: గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న గణేష్ మండపాలకు పోలీసుల నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని అని టేక్మాల్ ఏఎస్ఐ దయానంద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండపాల నిర్వాహకులు కమిటీ సభ్యుల పేర్లను, నిమజ్జనం సమయంలో వినియోగించే వాహనం తదితర వివరాలను ముందుగా అందజేయాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదన్నారు. పోలీసులు సూచించిన నిర్దిష్ట ప్రాంతాల్లో మాత్రమే వినాయక విగ్రహాల నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు.

'ఆలయ భూమిని ధరణిలో నమోదు చేయాలి'

ఝరాసంగం, ఆగస్టు 31: మండలంలోని ఏల్గోయి శివారులోని 125 సర్వే నెంబర్‌లో గల బీరప్ప ఆలయ భూమిని ధరణి పోర్టల్‌లో నమోదు చేయాలని గ్రామానికి చెందిన గొల్ల కుర్మ సంఘం నాయకులు శనివారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి చెందిన నర్సగొండ, మాణయ్య, మానెమ్మలు గతంలో 9 ఎకరాల భూమిని బీరప్ప స్వామి ఆలయానికి ఇచ్చారు. కానీ ఇంకా ధరణిలో నమోదు చేయలేదన్నారు. ఈ భూమి నిమ్జ్ పరిధిలోకి పోవడంతో పరిహారాన్ని పట్టాదారులకు చెల్లించడానికి అధికారులు నిర్ణయించారు. కావున చెక్కులు పట్టాదారులకు ఇవ్వరాదని కోరారు.

రుణమాఫీ కోసం ముమ్మరంగా 'రైతు కుటుంబాల నిర్ధారణ'

కొండాపూర్, ఆగస్టు 31: రుణమాఫీ కుటుంబ నిర్ధారణపై వస్తున్న దరఖాస్తులను నూతనంగా వచ్చిన జిల్లా వ్యవసాధికారి శివప్రసాద్ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. శనివారం ఆయన కొండాపూర్ రైతు వేదికను సందర్శించి రుణమాఫీ కుటుంబ నిర్ధారణ దరఖాస్తుల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని రైతులు సాగు ఖర్చులను తగ్గించి, ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. వెంట ఏవో గణేష్, ఏఈవో ప్రేమ్‌రాజ్, రైతులు ఉన్నారు.

● కోహీర్: మండలంలోని మనియార్‌పల్లి, బిలాల్‌పూర్, సజ్జాపూర్ గ్రామాల్లో శనివారం వ్యవసాయ సంచాలకుడు భిక్షపతి పర్యటించి రుణమాఫీ రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ డివిజన్‌లోని 5604 కుటుంబాల్లో 800 కుటుంబాలకు రుణమాఫీ కుటుంబ నిర్ధారణ చేశామన్నారు. వెంట ఏవో నవీన్‌కుమార్, ఏఈవో మౌనిక పాల్గొన్నారు.

● రేగోడు: మండలంలోని టి లింగంపల్లిలో శనివారం రుణమాఫీకి సంబంధించి ఇంటింటికీ వెళ్లి రైతు కుటుంబాల నిర్ధారణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రేగోడ్ వ్యవసాయాధికారి జావేద్ తెలిపారు. కార్యక్రమంలో వట్‌పల్లి మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారి సునీల్ కుమార్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

● టేక్మాల్: మండల వ్యాప్తంగా రుణమాఫీ కానీ రైతులు నోడల్ ఆఫీసర్‌ను సంప్రదించాలని ఏవో రాంప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.. బ్యాంకులో ఏవైనా తప్పులు ఉంటే నోడల్ అధికారులు సరిచేస్తారని వివరించారు. ఈ నెల 7వ తేదీ వరకు ఎడిట్ ఆప్షన్ ఉన్నందున రైతులు తమ రుణమాఫీ విషయంలో నోడల్ అధికారులను సంప్రదించాలని సూచించారు.

● పాపన్నపేట: మండలంలోని పొడ్చన్‌పల్లిలో రుణమాఫీ కుటుంబాల నిర్ధారణ ప్రక్రియ తీరును శనివారం మెదక్ జిల్లా వ్యవసాయాధికారి గోవిందు పరిశీలించారు. సేకరించిన వివరాలను యాప్‌లో అప్ లోడ్ చేస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డు లేక రుణమాఫీ కానివారు అధికారులకు పత్రాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో మాధురి, ఏఈవో అభిలాష్, తదితరులున్నారు.